క్లుప్తంగా

ఆర్టీసీ బస్సుల సంఖ్య పెంచాలి


ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

కమాన్‌పూర్: ఆర్టీసీ బస్సుల్లో ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణాన్ని ప్రవేశపెట్టడంతో బస్సుల్లో మహిళల ప్రయాణం పెరిగింది. సమయానికి ఆర్టీసీ బస్సులు రాక వచ్చిన బస్సుల్లో ప్రయాణికులు పరిమితికి మించి ఉండడంతో బస్‌స్టాపుల్లో బస్సులు ఎక్కడానికి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంథని-పెద్దపల్లి ప్రధాన రూటులో తిరిగే ఆర్టీసీ బస్సులు సంఖ్య తక్కువగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం 9గంటలకు బస్‌స్టాప్‌నకు వచ్చిన ప్రయాణిలకు 9:30 గంటల వరకు మూడు నుంచి నాలుగు ఆర్టీసీ బస్సులు వస్తున్నా.. వచ్చే బస్సుల్లో పరిమితికి మించి ప్రయాణికులు ఉండడంతో సమయానికి గమ్యస్థానాలకు చేరుకోలేకపోతున్నారు. ఈ విషయంపై ఆర్టీసీ మంథని డిపో మేనేజర్‌ను వివరణ కోరగా డిపోలో తగినన్ని బస్సులు అందుబాటులో లేకపోవడంతో కొంత వరకు ఇబ్బంది ఏర్పడుతోందని తెలిపారు.

కాచాపూర్‌లో బీరన్న పట్నాలు

జూలపల్లి: మండలంలోని కాచాపూర్‌లో యాదవుల ఆరాధ్య దైవం బీరన్న, కామరాతి, మాంకాళమ్మ, పట్నాలు, బోనాల పండుగ కనుల పండువగా నిర్వహించారు. ఆలయంలో బీర్ల పూజారులు పట్నం వేసి బోనాల నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు రఘువీర్‌సింగ్ పట్నాల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. మాజీ సర్పంచ్ బంటు ఎల్లయ్య, సంఘం అధ్యక్షుడు దాడి కొమురయ్య, నాయకులు మురళి, మల్లేశ్, మనోహర్, పుట్ట కొమురయ్య, రమేశ్, ఆవుల ఐలయ్య, లచ్చయ్య ఉన్నారు.

వేతనాలు ఇప్పించండి

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 7 నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్నామని వెంటనే వేతనాలు ఇప్పించాలని డాక్టర్ వెంకటేశ్‌కు ఔట్ సోర్సింగ్ సిబ్బంది వినతిపత్రం అందజేశారు. జీతాలు చెల్లించకపోవడంతో అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే కాంట్రాక్టర్‌తో మాట్లాడి సిబ్బందికి జీతాలు చెల్లించేలా చూడాలని విన్నవించారు. రెండు రోజుల్లో వేతనాలు చెల్లించకపోతే సమ్మె చేపట్టాల్సి వస్తుందని తెలిపారు. రాధ, రమేశ్, రాకేశ్, అనిల్, రమ్యశ్రీ, సునీత, నాగమణి, సాహిత్య, హేమ, సువర్ణ పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన సదస్సు

పాలకుర్తి: మండలంలోని బసంత్‌నగర్‌లో బుధవారం మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టు సుచరిత పాల్గొన్నారు. పలు చట్టాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరించారు. వీవో ప్రెసిడెంట్ వాసాల పద్మ, వీవోఏ రజినీ, కార్యదర్శి ముత్యాల సుజాత పాల్గొన్నారు.

తైబజార్ వేలం 22కు వాయిదా

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ పరిధిలో తైబజార్ నిర్వహణ కోసం బుధవారం చేపట్టిన బహిరంగ వేలం ఈనెల 22కు వాయిదా వేసినట్లు మున్సిపల కమిషనర్ ఆకుల వెంకటేశ్ తెలిపారు. వేలానికి బుధవారం కేవలం రెండు దరఖాస్తులు మాత్రమే రావడంతో ఆదాయం తగ్గే అవకాశముందని భావించి వాయిదా వేసినట్లు పేర్కొన్నారు.

ఛత్రపతి శివాజీ పట్టాభిషేక వేడుక

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలో ఛత్రపతి శివాజీ పట్టాభిషేక 350వ వార్షికోత్సవం ఛత్రపతి యువసేన వ్యవస్థాపకుడు శివంగారి సతీశ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. శివాజీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూ సామ్రాజ్య దివస్ సందర్భంగా ఛత్రపతి శివాజీ పట్టాభిషేక కార్యక్రమాన్ని ప్రతి ఏటా నిర్వహిస్తున్నామని సతీశ్ పేర్కొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

రామగుండం: వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎంపీడీవో ఎం ఏ.అలీం ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండల పరిధిలో చిన్న గ్రామ పంచాయతీల్లో వంద, పెద్ద పంచాయతీల్లో 250 ఆయిల్‌బాల్స్ సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి గురువారం గ్రామంలో ఫాగింగ్ చేయాలని, ప్రతి శుక్రవారం ఇంటింటా పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీవో అబ్దుల్ వాజీద్, ఈసీ అయ్యూబ్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్యపు కోరల్లో గౌరెడ్డిపేట

- గ్రామ శివారులో చెత్త డంప్ చేస్తున్న వైనం
- దుర్గంధంతో ఇబ్బంది పడుతున్న జనం
- అనారోగ్య సమస్యలు వస్తున్నాయంటూ ఆందోళన


గ్రామ శివారులో పేరుకుపోయిన చెత్తనిల్వలు

పెద్దపల్లిరూరల్: పర్యావరణాన్ని పరిరక్షిస్తామంటూ చెప్పే అధికారులు, ప్రజాప్రతినిధులు ఆచరణలో మాత్రం అంతంతే అని స్థానికంగా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలో సేకరించిన చెత్తను తరలించేందుకు అవసరమైన డంపింగ్‌యార్డు అందుబాటులో లేకపోవడంతో మండలంలోని గౌరెడ్డిపేట గ్రామ శివారులో డంప్ చేస్తున్నారు. ఈ డంప్‌యార్డుకు రాఘవాపూర్ శివారు కూడా సమీపంలో ఉంది. ఆ ప్రాంతంలో ఉన్న ఇటుకబట్టీల్లో పనిచేసే వలసకార్మికులు నిత్యం దుర్గంధాన్ని పీలుస్తూ రోగాల బారిన పడుతున్నారు.

నెలలుగా కాలుతున్న చెత్త..

పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేట గ్రామశివారులోని డంపింగ్‌యార్డులో గుర్తు తెలియని వారెవరో నిర్లక్ష్యంగా పడేసిన నిప్పురవ్వతో చెత్త అంటుకుని నెలలుగా కాలుతోంది. ఇటీవల గ్రామస్తులు అనారోగ్యం బారిన పడడంతో అప్రమత్తమైన మున్సిపల్ సిబ్బంది కాలుతున్న చెత్తను చల్లార్చేందుకు పైపులతో నీళ్లు చల్లుతున్నారు. మంట అంటుకున్న కారణంగా ఆ ప్రాంతం నుంచి వెలువడే పొగ సమీపంలోని ఇటుకబట్టీల్లో పనిచేసే వలస కూలీలతో పాటు తాము పీల్చుకోవాల్సి వస్తోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రోజూ 30ట్రాక్టర్ల చెత్త చేరుతోంది..

గౌరెడ్డిపేట డంపింగ్‌యార్డుకు రోజూ 30 ట్రాక్టర్ల మేర చెత్త చేరుతోంది. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని 36 వార్డుల నుంచి 26 ట్రాక్టర్ల చెత్త తరలుతుండగా గౌరెడ్డిపేట, రాఘవాపూర్ గ్రామాల చెత్తతో పాటు ఇటుకబట్టీల్లోని వలసకూలీలు పడేసే చెత్తను సైతం ఇదే డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నట్లు సమాచారం. చెత్తతో పాటు జంతువుల కళేబరాలు, వ్యర్థాలను కూడా పడేయడం ఇబ్బందిగా మారిందని స్థానికులు అంటున్నారు. గతేడాది ఓ నిరుపేద వ్యక్తి మరణించగా ఆ శవాన్ని సైతం ఇదే ప్రాంతంలోని పల్లెప్రకృతి వనంలో గుట్టుచప్పుడు కాకుండా పైపైనే పూడ్చిపెట్టారు. ఆ తర్వాత కొద్దిరోజులకు ప్రకృతివనంలో ఉపాధికూలీలు పనిచేస్తుండగా శవం బయట పడడంతో కూలీలు భయానికి గురయ్యారు. అప్పటి సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్ ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించారు. చెత్తతో దుర్గంధం వెలువడుతోందని, ఎవరైనా మరణిస్తే ఆ ప్రాంతంలోనే ఉన్న వైకుంఠధామంలో అంత్యక్రియల నిర్వహణ కోసం రాలేకపోతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. చెత్త సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

భరించలేని దుర్వాసన



పెద్దపల్లి మున్సిపల్ నుంచి ట్రాక్టర్ల కొద్ది చెత్తను తెచ్చి మా ఊరి చివర పారబోస్తుండడం ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లెప్రకృతివనం పక్కనే చెత్తను డంపు చేయడంతో ఆ ప్రాంతంలో వెలువడే దుర్వాసన భరించలేక పోతున్నాం.

– రామరాజు, గౌరెడ్డిపేట

పరిష్కారం చూపాలి



చెత్త చెదారాన్ని తెచ్చి మా ఊరి శివారులో వేయడం సరికాదు. మా ఊరి అవసరాలకోసం పల్లెప్రకృతివనం, సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠధామాన్ని వినియోగించుకోలేని పరిస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు సమస్యకు పరిష్కారం చూపాలి.

– దాగేటి సుధాకర్, గౌరెడ్డిపేట

బయోమైనింగ్ ప్లాంట్ ఏర్పాటు



పెద్దపల్లి నుంచి సేకరించిన చెత్తను ప్రస్తుతం డంప్ చేస్తున్న ప్రాంతంలో సుమారు రూ.3.5కోట్ల వ్యయంతో బయోమైనింగ్ మరో రెండునెలల్లో ప్లాంట్ ఏర్పాటు చేస్తాం. చేస్తున్నాం. ఇంటింటా సేకరించిన వ్యర్థాలను ఏరోజుకారోజు శుద్ధి చేస్తాం.

– ఆకుల వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్

బొగ్గు బ్లాకుల వేలంను అడ్డుకుంటాం


మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియను అడ్డుకొని సింగరేణి సంస్థను కాపాడుకునేందుకు జేఏసీగా ఒక్కటై పోరాటానికి సిద్ధమని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గడిచిన పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం బొగ్గు బ్లాకులతో పాటు, ఇతర ఏ ఖనిజ నిల్వలను కూడా వేలం వేయకుండా కాపాడిన విషయాన్ని కార్మికులు గమనించాలన్నారు. సింగరేణిలో ప్రైవేటీకరణను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించబోమని గత అసెంబ్లీ, సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల సందర్భంగా హామీలు ఇచ్చి గెలుపొందిన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ కార్మిక సంఘాలు కూడా బొగ్గు బ్లాకుల వేలంలో సింగరేణి సంస్థ పాల్గొనాలని ప్రచారం చేస్తున్న తీరును కార్మికులు గమనించాలన్నారు. ఇతర సంస్థలకు బొగ్గు బ్లాకులను కేటాయిస్తే ఇటీవల కొత్తగా ఉద్యోగాలలో చేరిన 20వేల మంది కార్మికుల భవిష్యత్ గందరగోళంలో పడుతుందన్నారు. సింగరేణి గుర్తించిన బొగ్గు బ్లాకులను సింగరేణికే అప్పగించేలా కార్మిక సంఘాలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. కలిసి వచ్చే కార్మిక సంఘాలతో ఐక్య కార్యాచరణ కమిటీ(జేఏసీ) ఏర్పాటు చేసి బొగ్గు బ్లాకుల వేలానికి వ్యతిరేకంగా పోరాడుతామని తెలిపారు. కార్మిక నాయకులు నూనె కొమురయ్య, మాదాసి రామ్మూర్తి, పర్లపల్లి రవి, కె.సురేందర్‌రెడ్డి, పెట్టం లక్ష్మణ్, పల్లె సురేందర్, పులిపాక శంకర్, బేతి చంద్రయ్య పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి


మాట్లాడుతున్న నరేశ్

యైటింక్లయిన్‌కాలనీ: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు నరేశ్ డిమాండ్ చేశారు. స్థానిక ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో బుధవారం జరిగిన ఆర్‌జీ-2 డివిజన్ ఎస్‌సీసీడబ్ల్యూయూ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని 24న జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం అధ్యక్షురాలు డి.బుచ్చమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఐ.కృష్ణ, బి.అశోక్, బండ పద్మ, మేరీ, సమ్మక్క, రాజనర్సు, ప్రేమ్‌కుమార్, లింగయ్య, రమేశ్, రాజబాబు, కాంతయ్య, రవి, నర్సయ్య, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

గాలి దుమారానికి కూలిన రేకుల షెడ్డు


పరిశీలిస్తున్న మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్

కాల్వశ్రీరాంపూర్: మండలంలోని చిన్నరాతుపల్లిలో మంగళవారం రాత్రి గాలి దుమారానికి గ్రామానికి చెందిన మ్యాదరి అశోక్‌కు చెందిన రేకుల షెడ్డు కూలిపోయింది. వర్షానికి ఇంట్లో ఉన్న బియ్యం, బట్టలు తడిసిపోయాయి. ఫ్యాన్లు విరిగిపోయాయి. నిరుపేదలైన అశోక్ కుటుంబం నిలువనీడను కోల్పోయింది. పొరుగు వారి ఇంట్లో రాత్రి తలదాచుకున్నారు. బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని మాజీ సర్పంచు దాసరి నవలోక ప్రభుత్వాన్ని కోరారు.

ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తాం

మండలంలోని చిన్నరాతుపల్లికి చెందిన మ్యాదరి అశోక్ రేకుల షెడ్డు మంగళవారం రాత్రి వీచిన గాలి దుమారానికి కూలిపోయింది. బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఎంపీపీ సారయ్యగౌడ్, మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ సర్పంచు దాసరి నవలోక బుధవారం పరామర్శించారు. మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణారావు దృష్టికి తీసుకెళ్లి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తామని భరోసా ఇచ్చారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న కౌశిక హరి

పాలకుర్తి: బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ కర్మాగారం కాంట్రాక్ట్ కార్మికుల పెండింగ్ సమస్యలపై యాజమాన్యంతో చర్చించి వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని కాంట్రాక్ట్ కార్మికసంఘం అధ్యక్షుడు కౌశికహరి అన్నారు. కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడిగా విజయం సాధించిన సందర్భంగా బుధవారం కౌశికహరితో పాటు ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్ కంపెనీలో పర్యటించారు. కేశోరాం ప్లాంట్‌హెడ్ శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఆర్ మేనేజర్ పార్థసారథిని వారి చాంబర్‌లో కలిశారు. అనంతరం కార్మికులను కలిసి స్వీట్లు పంపిణీ చేశారు. అంతకుముందు బసంత్‌నగర్ శ్రీకోదండ రామాలయం, అయ్యప్పస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాయకులు పెరుమాండ్ల రమేశ్, బత్తిని సతీశ్‌గౌడ్, మల్లయ్య, కమలాకర్‌రెడ్డి, తిరుపతి, రమేశ్, ఓదెలు పాల్గొన్నారు.

కౌశిక హరికి సన్మానం

రామగుండం: కేశోరాం సిమెంట్ కర్మాగారం కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడిగా గెలుపొందిన కౌశిక హరిని బుధవారం పట్టణంలోని ఆయన స్వగృహంలో బీఆర్ఎస్ ప్రతినిధులు సన్మానించారు. కార్పొరేటర్లు కన్నూరి సతీశ్, ముదాం శ్రీనివాస్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బొడ్డుపల్లి శ్రీనివాస్, శిరంశెట్టి శ్రీనివాస్, మద్దికుంట శంకర్, శివరాత్రి గంగాధర్, ఉప్పరి లక్ష్మణ్, దారంగుల కుమార్, అత్తరొద్దీన్, సారయ్యనాయక్, కత్తెరమల్ల నర్సింగ్, సబ్బు శంకర్, దాముక వంశీ, ముస్త్యాల శంకర్, పల్లికొండ నరేశ్, బోనగిరి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణిలో రాజకీయ జోక్యం తగదు'


మాట్లాడుతున్న రాజ్‌కుమార్

రామగిరి: సింగరేణిలో రాజకీయ జోక్యంతో తీవ్ర నష్టం జరుగుతుందని, కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతర పోరాటాలు చేస్తుందని ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ రాజ్‌కుమార్ అన్నారు. ఆర్జీ-3 పరిధిలోని ఏపీఏ గనిలో బుధవారం ఆర్జీ-3 బ్రాంచ్ సెక్రటరీ ఎం.ఆర్‌సీ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికుల సొంతింటి పథకం అమలు చేయాలని, సీబీఎస్‌ఈ సిలబస్‌తో సింగరేణి యజమాన్యం ఈ విద్యాసంవత్సరంలో స్కూల్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఏపీఏ గనిలో పనిచేస్తున్న కార్మికులకు ప్రాజెక్టు అలవెన్స్, జనరల్ మజ్దూర్ సీనియర్స్‌ను ఓపెన్‌కాస్టులకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. బ్రాంచ్ వైస్ ప్రసిడెంట్ కె.సమ్మయ్య, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.రాజేశ్, అనపర్తి రాజయ్య, పిట్ సెక్రటరీ గంగాధర్, అసిస్టెంట్ సెక్రటరీ కుమార్, షిఫ్ట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఘనంగా రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు


గోదావరిఖనిటౌన్: ఆశ్రమంలో వేడుకలు


పెద్దపల్లిరూరల్: బస్టాండ్ వద్ద..

పెద్దపల్లిరూరల్/రామగిరి/సుల్తానాబాద్/ధర్మారం/కాల్వశ్రీరాంపూర్/గోదావరిఖనిటౌన్/కమాన్‌పూర్/యైటింక్లయిన్‌కాలనీ/పాలకుర్తి/ముత్తారం/జూలపల్లి: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలను బుధవారం జిల్లాలోని రామగుండం, పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల్లో నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు. పలువురు నాయకులు మాట్లాడుతూ బీజేపీ పాలనలో జరిగిన అక్రమాలను ప్రజలకు వివరిస్తూ జోడో యాత్ర నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంచడంతో రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు.

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన ర్యాలీ

ధర్మారం: మండలంలోని నంది మేడారం గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సుష్మిత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది బుధవారం సికిల్‌సెల్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ సికిల్‌సెల్ వ్యాధి జన్యుకారక వ్యాధని, ఈ వ్యాధితో హిమోగ్లోబిన్ ఉత్పత్తి చేసే జన్యువులు లోప భూయిష్టంగా మారి శరీరంలోని అవయవాలకు నష్టం చేస్తుందని వివరించారు.

నేడు నులిపురుగు నివారణ మాత్రల పంపిణీ

మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20న నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ ముత్యాల కరుణశ్రీ ప్రారంభిస్తారని వైద్యాధికారి సుష్మిత తెలిపారు. ఏడాది నుంచి 19ఏళ్ల లోపు వయసు ఉన్న విద్యార్థులకు ఈ మాత్రలను వైద్య సిబ్బందితో వేస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు.

జూలపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఆయుష్మాన్ భారత్ అండ్ హెల్త్, వెల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎల్‌టీ కిరణ్, ఏఎన్ఎం అనంతరావ్ , ఆయుష్మాన్ భారత్ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

దరఖాస్తుల ఆహ్వానం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సెక్టార్-3 సింగరేణి ఉన్నత పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బంది నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కరస్పాండెంట్, డీజీఎం(పర్సనల్), అధికార ప్రతినిధి రాజేంద్రప్రసాద్ బుధవారం తెలిపారు. 2024-2025 విద్యా సంవత్సరంలో తాత్కాలిక ప్రాతిపదికన సిబ్బందిని నియమిస్తామన్నారు. ఇంగ్లిష్ మీడియంలో జీవశాస్త్రం-1, సోషల్ స్టడీస్-1, జూనియర్ అసిస్టెంట్-2, అటెండర్-1 పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. అర్హతలు, అనుభవం కలిగిన అభ్యర్థులు ఈనెల 24వ తేదీ వరకు దరఖాస్తు చేయాలని సూచించారు. వివరాల కోసం పాఠశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

గోదావరిఖని: నిబంధనలకు విరుద్ధంగా ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనారెడ్డి హెచ్చరించారు. బుధవారం మేడిపల్లి ఓసీపీ రోడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకడంప్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వెంటనే ఈ విషయం రెవిన్యూ అధికారులకు సమాచారం అందించగా అక్కడకు చేరుకుని ఇసుకను స్వాధీనం చేసుకున్నారన్నారు. పట్టుకున్న ఇసుక సుమారు 42 ట్రాక్టర్లు ఉంటుందన్నారు.

టిప్పర్లను అడ్డుకున్న గ్రామస్తులు

ఎలిగేడు: మండలంలోని సుల్తాన్‌పూర్ శివారులోని వెదురుగట్టు బోర్ల నుంచి ఎర్రమట్టిని అధిక లోడుతో రవాణా చేస్తున్న వాహనాలను ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు ఆధ్వర్యంలో గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎర్రమట్టి తరలింపుపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధిక లోడుతో డి86 కెనాల్ రోడ్డు నుంచి నడుస్తుండడంతో రోడ్లు దెబ్బతినడమే కాకుండా ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. టిప్పర్లు గ్రామం నుంచి కాకుండా వేరే వైపు నుంచి వెళ్లాలని డిమాండ్ చేశారు.

ప్రయివేట్ వద్దు.. సర్కారు బడి ముద్దు

ముత్తారం: ప్రయివేట్ పాఠశాల వద్దు.. సర్కారు బడి ముద్దు అని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ముత్తారం మండలం మైదంబండలో తమ ఆటపాటలతో ప్రదర్శన చేశారు. సర్కారు బడిలో చేర్పించడంతో కలుగు ప్రయోజనాలను వివరించారు. కళాకారులు కొంద్ర వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేశ్, బుర్ర శంకర్‌గౌడ్, జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, దీకొండ శ్రావణ్, సలేంద్ర రాజన్న, రేణుక, రమ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

రామగుండం: అంతర్గాం మండల పరిధి గోలివాడ గ్రామంలోని నిరుపేద కుటుంబానికి చెందిన స్వర్గీయ జక్కుల శంకరయ్య కూతురు రజిత వివాహం నిశ్చయమైంది. కాగా బుధవారం అదే గ్రామానికి చెందిన కొలిపాక శ్రీవాణిరెడ్డి తన తాత, నానమ్మ జ్ఞాపకార్థంగా రూ.20వేలు రజితకు అందజేశారు. కొలిపాక చంద్రారెడ్డి, బాలసాని సత్తయ్య గౌడ్, జైపాల్‌రెడ్డి, ధర్ని నరేందర్, మాడ మల్లేశ్, గోసిక తిరుపతి, సోకాల చంద్రమోహన్ ఉన్నారు.

లోవోల్టేజీ సమస్యను పరిష్కరించండి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ప్రగతినగర్‌లో కొంతకాలంగా లోవోల్టేజీ విద్యుత్ సమస్య రావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీవాసులు గోదావరిఖని ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. స్పందించిన ఏడీఈ గురువారం కాలనీలో లోవోల్టేజీ సమస్యలను గుర్తించి పది రోజుల్లో సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏఈ మైపాల్ రెడ్డి, బైరం సతీశ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెద్దపల్లిరూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకుడు కల్లెపల్లి అశోక్ కోరారు. బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. పీఆర్‌సీలో రూ.26వేల వేతనంగా నిర్ణయించాలన్నారు. నాయకులు బొంకూరి సాగర్, మహంకాళిస్వామి, కుక్క శంకర్, అవినాష్ ఉన్నారు.

కొనసాగుతున్న ఈపీ ఆపరేటర్ ట్రెయినీ డ్రైవింగ్ నైపుణ్య పరీక్షలు

రామగిరి: ఈపీ ఆపరేటర్ ట్రెయినీ ఉద్యోగ నియామకాలకు సంబంధించి సింగరేణి సంస్థ అంతర్గత అభ్యర్థుల కోసం సెంటనరీకాలనీ రాణి రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న డ్రైవింగ్ నైపుణ్య పరీక్షలు రెండోరోజు కొనసాగాయి. మొదటి రోజు మంగళవారం 120 మందికి గాను 101 మంది, రెండో రోజు బుధవారం 120 మందికి గాను 111 మంది హాజరయ్యారని కమిటీ చైర్మన్, ఎస్‌వోటూ జీఎం జి.రఘుపతి ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈ నెల 30న నిర్వహించనున్న రాత పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ పరీక్షలు గురువారం కూడా కొనసాగుతాయని జీఎం పేర్కొన్నారు.

అమ్మచూపు సజీవం

కోల్‌సిటీ: గోదావరిఖని విఠల్‌నగర్‌కు కర్న లక్ష్మీకాంత(85) మంగళవారం రాత్రి మృతి చెందారు. కాగా ఆమె నేత్రాలను బుధవారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులు దానం చేశారు. లక్ష్మీకాంత నేత్రాలను దానం చేయాలని కుటుంబ సభ్యులకు స్థానిక కళాకారులు మేజిక్ రాజా, చంద్రపాల్ అవగాహన కల్పించారు. దీంతో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఎస్.కే.ఆరిఫ్ సహకారంతో నేత్రాలను హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంక్‌కు తరలించారు.

నేత్రదానం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం న్యూపీకే రామయ్య కాలనీకి చెందిన చింతం రాజమ్మ(75) బుధవారం మృతి చెందింది. ఆమె కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ ప్రతినిధి లగిశెట్టి చంద్రమౌళి అవగాహన కల్పించడంతో మృతురాలి కుమారుడు రవీందర్, కూతుళ్లు భాగ్య, సరస్వతి, సునీత తల్లి నేత్రాలను దానం చేయడానికి అంగీకరించారు. టెక్నీషియన్ ఆరిఫ్ సహకారంతో నేత్రాలను హైదరాబాద్‌లోని వాసన్ ఐబ్యాంక్‌కు తరలించారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలి

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఫెర్టిలైజర్‌సిటీ టౌన్‌షిప్‌లోని శ్రీచైతన్య పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు, స్కూల్ దుస్తులు విక్రయిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం పాఠశాల గేట్ ఎదుట ధర్నా చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ అధిక రేట్లకు పాఠ్యపుస్తకాలను విక్రయిస్తున్న పాఠశాలపై చర్యలు తీసుకోవాలని మండల, జిల్లా విద్యాధికారులకు సమాచారం ఇచ్చినా చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. పాఠశాలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు.

ప్రీస్కూల్ ప్రణాళికపై అంగన్‌వాడీలకు శిక్షణ

రామగుండం: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ నూతన విధి విధానాలతో పాటు ప్రీస్కూల్ ప్రణాళిక తదితర అంశాలపై అంతర్గాం, పాలకుర్తి మండలాల అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ శిబిరం నిర్వహించారు. బుధవారం బ్రాహ్మణపల్లి రైతు భవన్‌లో ప్రత్యేక శిక్షకురాలితో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇప్పించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేర్పించే ముందు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే చిన్నారులకు ప్రీస్కూల్ స్థాయిలో విద్యాబోధన జరగాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. సీడీపీవో గండ్ల స్వరూపరాణి ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ శిబిరానికి సూపర్‌వైజర్స్ పుష్పలత, శరణ్య, జమున పాల్గొన్నారు.

ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ


దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాల కోసం అర్హులంతా ప్రజాపాలన కార్యక్రమంలో దరఖాస్తులు చేసుకునేందుకు వస్తున్నారు. ఇటీవల ఎన్నికలకోడ్ అమల్లో ఉన్న కారణంగా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేశారు. ఎన్నికల కోడ్ ముగిసిన నేపథ్యంలో పెద్దపల్లిలోని ఎంపీడీవో ఆఫీసులో పల్లె ప్రాంతాల ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తుండగా మున్సిపల్ కార్యాలయంలో పట్టణ ప్రాంత ప్రజల నుంచి అర్జీలు తీసుకుంటున్నారు. ఎక్కువగా గృహజ్యోతి పథకం కింద జీరో విద్యుత్ బిల్లు అందించాలంటూ వినతులు వస్తున్నట్లు అధికారులు తెలిపారు.